సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం ၊ 7 ၊ సెప్టెంబర్ ၊ 2024
I



సడలుతున్న ‘పట్టు’

పట్టుపురుగుల పెంపకం (మల్బరీ) పంట గతంలో భారీగా సాగయ్యేది. క్రమేణా తగ్గుతూ వస్తోంది. దీంతో మదనపల్లె ప్రభుత్వ పట్టు గూళ్ల మార్కెట్ బోసిపోతోంది. -IIలో



ఇంటి పట్టాల పంపిణీ మళ్లీ వాయిదా

మంగంపేట కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల పునరావాసం కోసం సంకల్పించిన ఆర్‌ఆర్‌-5 ఇంటి పట్టాల పంపిణీ మళ్లీ వాయిదా పడింది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.320
రెండోరకం	రూ.200	రూ.266

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 210 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

11న ఉద్యోగ మేళా

పీలేరురూరల్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న జిల్లా స్థాయి ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో నెలింక్ టెలీ కమ్యూనికేషన్, డిక్షన్ టెక్నాలజీస్,వింగ్ టెక్, హీరో, యంగ్ ఇండియా తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు.18 నుంచి 30 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏదేనీ డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసి ఉండాలన్నారు. వివరాలకు 9966086996, 8997776368 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆల్ ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


నాగసాయిదీప

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణానికి చెందిన సాగసాయిదీప ఆల్ ఇండియా బాలికల సబ్ జూనియర్ పోటీలకు ఎంపికై ంది. స్థానిక వశిష్ట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నాగసాయిదీప తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో మధ్యప్రదేశ్ నీమంచ్‌లో ఈనెల 8 నుంచి 17 వరకు జరిగే ఆల్ ఇండియా టోర్నమెంట్‌లో పాల్గొనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీధర్, ప్రెసిడెంట్ దిలీప్ తెలిపారు. దీపను కోచ్ మహేంద్రనాయక్, పీఈటీ అంజనప్ప, ప్రిన్సిపాల్ నీనా సి నాయర్ అభినందించారు.

రక్తహీనత రహిత సమాజమే ధ్యేయం


ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న ఇంతియాజ్‌బేగ్

రాయచోటి అర్బన్: రక్తహీనత రహిత సమాజమే ధ్యేయంగా అందరూ కలసికట్టుగా పనిచేద్దామని జిల్లా నేషనల్ డీవార్మింగ్ డే (ఎన్‌డీడీ) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఇంతియాజ్ పిలుపునిచ్చారు. రాయచోటిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు ఆయన ఆల్బెండజోల్ – 400 ఎంజీ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను భోజనానంతరం అందజేస్తామన్నారు. ఏవైనా కారణాలతో ఆరోజు మాత్రలను తీసుకోని వారికి ఈనెల 25న ఇస్తామని తెలిపారు.ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి శివప్రతాప్ నాయక్ మాట్లాడుతూ రక్తహీనత రహిత సమాజం కోసం ప్రతి ఏడాది రెండు పర్యాయాలు డీవార్మింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. .

17 నుంచి 21 వరకు గుంటూరు ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: గుంటూరు–తిరుపతి–గుంటూరు మధ్య నడుస్తున్న గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 17వ తేది నుంచి 21వ తేది వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. గిద్దలూరు–దిగువమెట్ట మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. గుంటూరు–తిరుపతి మధ్య నడిచే ఈ రైలు ఈనెల 17 నుంచి 21వ తేదివరకు, తిరుపతి–గుంటూరు మధ్య నడిచే రైలు ఈనెల 18 నుంచి 21వ తేది వరకు రద్దు చేశామన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు.

కుంగిన భూమి పరిశీలన


కుంగిన భూమిని పరిశీలిస్తున్న వైవీయూ అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజీ, ఎర్త్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం దువ్వూరు మండలం రామాపురం వ్యవసాయ భూమిని సందర్శించారు. రైతు మానుకొండ వెంకట శివ వ్యవసాయ భూమిలో సుమారుగా 15 అడుగుల లోతు మేర భూమి కుంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జియాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ సున్నపు రాతి పొరలు భూగర్భంలో జరిపిన చర్య ఫలితంగా భూమి కుంగిపోయిందని గుర్తించామన్నారు. ఐదేళ్ల కిందట కూడా ఇదే ప్రాంత సమీపంలో సింక్ హోల్స్ ఏర్పడినట్లు కనుగొన్నామన్నారు.

చవితి వేడుక.. ఊరూవాడా వేదిక


మదనపల్లె: వాహనాల్లో వినాయకుడిని తరలిస్తున్న భక్తులు


రాజంపేటలోని శివాలయం సర్కిల్‌లో మండపాన్ని సిద్ధం చేస్తున్న నిర్వాహకులు



3000 జిల్లాలో ప్రతిష్ఠించనున్న విగ్రహాల సంఖ్య (సుమారు)

15000 నుంచి 3,00,000 విగ్రహాల ఖరీదు (రూ.)



1,00,000 ఒక్కో మండపం ఏర్పాటుకు అయ్యే ఖర్చు రూ.(సుమారు)

100 మట్టి విగ్రహాల ఖరీదు (రూ)

- నేడు వినాయక చవితి
- పూజలకు సిద్ధంగా పందిళ్లు

రాజంపేట టౌన్/రాయచోటిటౌన్/మదనపల్లె సిటీ: భక్తకోటికి ఇష్టదైవం బొజ్జగణపయ్య. ఒళ్లంతా కళ్లు చేసుకొని ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన వినాయక చవితి పండుగ రానేవచ్చింది. శనివారం వినాయక చవితిని జరుపుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. గణపయ్య కొలువుదీరక ముందే జిల్లా అంతటా సందడి వాతావరణం నెలకొంది. వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాలకు గణనాధుల విగ్రహాలను శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో కోలాహలంగా తీసుకెళ్లారు. గత ఏడాదికంటే ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఊరూవాడ ఎటుచూసినా సందడి సందడిగా ఉంది. ఉత్సవ కమిటీలవారు గణపయ్యను కొలువుదీర్చేందుకు మండపాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనేక ప్రాంతాల్లో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో స్వామి వారు భక్తులకు కనివిందు చేస్తూ దర్శనమిచ్చేలా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల నేపథ్యంలో చిన్నారుల్లోను, యువతలోను ఉత్సాహం ఉరకలేస్తుంది.

అక్కడ మహిళలే ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సాధారణంగా అన్ని ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ బాధ్యతను పురుషులు తీసుకుంటారు. అయితే రాజంపేట పట్టణంలోని గంగిరెడ్డిపాళెంలో అందుకు భిన్నంగా ఉత్సవాల నిర్వహణ ఉంటుంది. అక్కడ మహిళలే ఉత్సవాలను ముందు ఉండి జరిపిస్తారు. చవితి ఉత్సవాలకు వారే చందాలు పోగుచేస్తారు.


రాయచోటిటౌన్: విక్రయాలకు సిద్ధంగా ఉన్న మట్టి వినాయకులు

కిటకిటలాడిన మార్కెట్లు

జిల్లాలోని రాయచోటి, రాజంపేట,రైల్వేకోడూరు, మదనపల్లె, పీలేరు తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. మదనపల్లె పట్టణంలోని బెంగుళూరుబస్టాండు, చిత్తూరు బస్టాండు, నీరుగట్టువారిపల్లె,కృష్ణదేవాయ సర్కిల్, నిమ్మనపల్లె క్రాస్, నీరుగట్టువారిపల్లె, ఎన్టీఆర్ సర్కిల్, గొల్లపల్లి సర్కిల్ ప్రాంతాలు, రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లోని గాలివీడు రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోనే కాకుండా ప్రధాన కూడళ్లు మామిడి ఆకులు, అరటి పిలకలతో పాటు చెరుకుగడలతో నిండిపోయింది. కొనుగోలుదారులతో కిటకిటలాడింది పూల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పండ్ల ధరలు కూడా రెండింతలయ్యాయి. వినాయకుని ప్రతిమలు, పూలు,పండ్ల అమ్మకాలు ఉత్సాహంగా సాగాయి. మదనపల్లెలోని మెట్రో కాంప్లెక్స్ వద్ద హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమలు, రోజా మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. దేవళంవీధిలోని శ్రీ కాశీ విశ్వనాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక మండపం నిర్వాహకులకు ఉచితంగా పూజా సామగ్రిని అందజేశారు.




మదనపల్లె: పూలమార్కెట్‌లో కిటకిటలాడుతున్న కొనుగోలుదారులు


రాయచోటి: పండ్ల దుకాణాల వద్ద రద్దీ

ముగిసిన పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అర్చకులు సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మహాపూర్ణాహుతి,కుంభప్రోక్షణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ప్రాకారోత్సవం జరిగింది.

బాలాలయ ఉత్సవ విగ్రహాలకు పూజలు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బాలాలయ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు శుక్రవారం అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టమన్ను తీసుకొచ్చి బాలాలయంలోని చెక్క ఉత్సవ విగ్రహాలకు పూజలు జరిపారు.


పవిత్రమాలలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఓబులవారిపల్లె: మంగంపేట ఆర్‌ఆర్‌–5 పునరావాస కాలనీలో నిర్దేశించిన గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవితో కలిసి అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల తరలింపునకు ఆర్‌ఆర్‌–5లో ఇప్పటి వరకు జరిగిన పనుల గురించి సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఆర్‌–5 ముఖద్వారం ఆర్చ్ పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్‌ఆర్‌–5లో ఓసీ, ఎస్సీలకు కమ్యూనిటీ హాల్ మంజూరైందని కలెక్టర్ తెలిపారు. 15 రోజుల్లో నీటి సరఫరా పైప్‌లైన్, బోర్‌వెల్ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం పలు విషయాలపై మంగంపేట ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డితో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ పీర్ మున్నీ, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, హౌసింగ్, దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మంగంపేట ఆర్‌ఆర్‌-5 అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కేజీబీవీ పాఠశాల తనిఖీ

సుండుపల్లె: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సుండుపల్లిలోని కేజీబీవీ ఆదర్శ పాఠశాల, వసతి గృహాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవితో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థునులు ఉన్నారు. భోజనం, వసతి ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి పలు అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ శివ శృతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం వైపు.. రైతు చూపు

ఖరీఫ్‌లో రైతుల కష్టాలు గట్టెక్కలేదు.. సాగు ముందుకు సాగక అవస్థలు పడుతున్నారు. ఇంకా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. వర్షాలు కురిసినా చేను తడవలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సాగు నిరాశజనకంగా ఉంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ నెల మొదటి వారంలోనే జిల్లాలోకి ప్రవేశించాయి. అయినా ఆశించిన స్థాయిలో ప్రయోజనం లేకుండా పోయింది. వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. దీంతో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

- ఖరీఫ్‌ను వెంటాడుతున్న వర్షాభావం
- ముగిసిన వేరుశనగ సాగుసీజన్
- 17,473 హెక్టార్లలో ఆరుతడి పంటల సాగు


దుక్కులు చేస్తున్న రైతులు

జిల్లాలో ఆరుతడి పంటల సాగు వివరాలు

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
పీలేరు	2350
మదనపల్లె	3425
తంబళ్లపల్లె	4875
రాయచోటి	3286
రాజంపేట	1865
రైల్వేకోడూరు	1672

గుర్రంకొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు గడువు ముగిసింది. వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో జిల్లాలో 34 శాతం మేరకు వేరుశనగ పంట సాగు చేశారు. సీజన్ ముగియడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 17,473 హెక్టార్ల విస్తీర్ణంలో ఆరుతడి పంటల సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇందుకోసం రైతులు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే ఉలవల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆరుతడి పంటల సాగు: వర్షాధార పంటలైన ఉలవ, కంది, అలసంద, అనప వంటి ఆరుతడి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే వేరుశనగ సాగు కోసం పొలాలు దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న రైతులు గడువు ముగిసిపోవడంతో ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం పొలాలను మరోసారి దుక్కులు చేసుకుంటున్నారు. ఆరుతడి పంటలను సెప్టెంబర్ 30 వరకు సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

ఉలవల కోసం ఎదురుచూపులు: ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన సబ్సిడీ ఉలవల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనకాయలు అంతంతమాత్రంగానే పంపిణీ చేసిన అధికారులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల సాగుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరుతడి పంటల్లో అతి తక్కువ ఖర్చుతో రైతుల చేతికందే పంటగా ఉలవ పంట ప్రసిద్ధి చెందింది. పంట సాగు కోసం అవసరమైన విత్తనాలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎంత మేరకు ఉలవలు అవసరమో జిల్లా ఉన్నతాధికారులకు ఆయా మండలాల వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇంతవరకు సబ్సిడీ ఉలవలు రైతు భరోసా కేంద్రాలకు చేరలేదు. ఈనెల రెండవ వారం లోగా పంటసాగు ప్రారంభిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులు అంటున్నారు. ప్రస్తుతం చెదురుమొదరు వర్షాలు కురుస్తున్నందున సకాలంలో ఉలవలు పంపిణీ చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

వేరుశనగ సీజన్ ముగిసింది



వేరుశనగ పంట సాగు గడువు ముగిసింది. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. పంటసాగు గడువు ముగియడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి ఇదే అదను. మరోసారి దుక్కులు చేసుకుంటున్నాం.
– నాగరత్నమ్మ, కమ్మపల్లె

ఉలవలు త్వరగా పంపిణీ చేయాలి



వేరుశనగ పంట సాగు సీజన్ గడవు ముగిసినందున ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటాం. ఇందు కోసం అవసరమైన ఉలవలను ప్రభుత్వం త్వరగా పంపిణీ చేయాలి. గతేడాది సకాలంలో రైతులకు ఆర్బీకేల్లో ఉలవలు సబ్సిడీపై ఇచ్చారు. ఇప్పుడు వర్షాలు కురుస్తున్నందున ఉలవ పంట సాగు చేసుకోవడానికి మంచి అదునుగా ఉంటుంది.
– రమణయ్య, గంగిరెడిపల్లె

ప్రతిపాదనలు పంపాం



ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన ఉలవలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారం రోజుల్లోగా ఆర్బీకేలకు చేరుతాయనే సమాచారం ఉంది. ప్రభుత్వం నుంచి ఉలవలు రాగానే రైతులకు అందజేస్తాం.
– నవీన్‌కుమార్‌రెడ్డి, ఏవో, గుర్రంకొండ.

ఇసుక రీచ్ ప్రారంభం


ఆర్‌బుడుగుంటపల్లెలో ఇసుకరీచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్, సబ్‌కలెక్టర్ నదియాదేవి

రాజంపేట: చెయ్యేరు నదీ పరీవాహక ప్రాంతమైన ఆర్‌బుడుగుంటపల్లె (రాజంపేట మండలం)లో ఇసుక రీచ్‌ను శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి వెంట కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్‌కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, మైన్స్ అండ్ జియాలజీ ఏడీ రవి, పలువురు రాయచోటి టీడీపీనేతలు ఉన్నారు. వినీవా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు ఏటిలో నుంచి ఇసుకను రీచ్‌కు తీసుకురావడం, లోడింగ్ చేయడం లాంటి పనులను అప్పగించారు. రీచ్ నిర్వహణ ప్రభుత్వమే చూసుకుంటున్నా..పనులు మాత్రం వినీవా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చేస్తుందని సమాచారం.

రాజంపేట ఇసుకరీచ్‌లో రాయచోటి నేతల హవా

ఆర్‌బుడుగుంటపల్లె(రాజంపేట) ఇసుక రీచ్‌లో రాయచోటి పచ్చనేతల హవా కనిపించింది. మంత్రి పర్యటనలో పాల్గొనేందుకు అవకాశం లేకపోవడంతో రాజంపేట నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజంపేట టీడీపీకి దిక్కెలేదు. ఇక మాకేమి ఉంటుందని నేతలు పెదవివిరిస్తున్నారు. పార్టీ మండల, పట్టణ కీలకపదవుల్లో ఉన్న వారు కూడా మంత్రి వస్తున్నాడనే సంగతి తెలియదని వాపోతున్నారు. ఇప్పటికే రాజంపేట నియోజకవర్గానికి ఇన్‌చార్జిలమనే చెప్పుకునే నేతలు కూడా మంత్రి కార్యక్రమంలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మంత్రి రాజంపేట మండలం అటవీగ్రామమైన ఆర్‌బుడుగుంటపల్లెలో ఇసుకరీచ్‌ను ప్రారంభించేందుకు వచ్చినా అక్కడ రాజంపేటకు చెందిన ఇన్‌చార్జి రేసులో ఉన్న నేతలెవ్వరు కనుచూపు మేరల్లో కనిపించలేదు. ఇప్పటికే ఇన్‌చార్జి రేసులో సుగవాసి బాలసుబ్రమణ్యం, చమర్తి జగమ్‌మోహన్‌రాజు, బత్యాల చెంగల్రాయుడు, మేడా విజయశేఖర్‌రెడ్డి ఉన్నట్లు తమ తమ పార్టీ వర్గాల ద్వారా ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే.

క్లుప్తంగా

రాజీ మార్గానికి వేదిక లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : కక్షిదారులు రాజీ కావడానికి చక్కని వేదిక లోక్అదాలత్ అని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని న్యాయసేవాసదన్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి ఆదేశాల మేరకు పోలీస్ అధికారులతో లోక్ అదాలత్పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ నెల 14న జరుగబోయే జాతీయలోక్ అదాలత్లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన రెడ్డిపీర్

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని మండల పరిధి గువ్వలచెరువు ఘాట్ మార్గంలో శివాలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గువ్వలచెరువుకు చెందిన రెడ్డిపీర్(24) సాయంత్రం ద్విచక్రవాహనంలో ఘాట్ మార్గంలో వెళ్తుండగా మార్గంమధ్యలో శివాలయం వద్దకు రాగానే.. కడప వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుధాకర్రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారు అయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి పట్టాల పంపిణీ మళ్లీ వాయిదా

– ప్రజాప్రతినిధులు రాకపోవడంతో..



ఇంటి పట్టాల పంపిణీ కోసం చేసిన ఏర్పాట్లు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల పునరావాసం కోసం సంకల్పించిన ఆర్ఆర్–5 ఇంటి పట్టాల పంపిణీ మళ్లీ వాయిదా పడింది. మొదట్లో ఈ నెల 2న ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. అప్పుడు పంపిణీ జరగలేదు. తరువాత శుక్రవారం ఆర్ఆర్–5లో గ్రామస్తులకు పట్టాలను జిల్లా మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని ప్రకటించారు. తీరా ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంతో కలెక్టర్ చామకూరి శ్రీధల్ మళ్లీ వాయిదా వేశారు. ఇలా రెండు సార్లు వాయిదా పడింది. ఆర్ఆర్–5లో ఏర్పాట్లు చేసి పంపిణీ చేపట్టకపోవడంపై గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సడలుతున్న పట్టు

- టమాట పంటతో దెబ్బ
- తగ్గుతున్న దిగుబడి
- బోసిపోతున్న మార్కెట్





పట్టుగూళ్లు రాక వెలవెలబోతున్న మార్కెట్



మల్బరీ తోట

మదనపల్లె సిటీ : పట్టుపురుగుల పెంపకం(మల్బరీ) పంట గతంలో భారీగా సాగయ్యేది. క్రమేణా తగ్గుతూ వస్తోంది. దీంతో రాష్ట్రంలోనే హిందూపురం తరువాత పట్టుగూళ్ల విక్రయానికి పేరుమోసిన మదనపల్లె ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ బోసిపోతోంది. గత నెల 16 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు 20 రోజులుగా మార్కెట్కు గూళ్లే రాలేదు. ఇలాంటి పరిస్థితి మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేదు. ఒకప్పుడు నిత్యం 5 టన్నుల పట్టుగూళ్లు వస్తుండగా.. ప్రస్తుతం పూర్తిగా పడిపోయాయి. 20 రోజుల్లో కేవలం నాలుగు రోజుల్లో 900 కేజీలకే పరిమితమైంది. రైతులు లేక మార్కెట్ బోసిపోతోంది.

చనిపోతున్న పట్టు పురుగులు

జిల్లాలో పడమటి ప్రాంతాల్లో రైతులు వాణిజ్యపంట అయిన టమాటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎక్కువగా పురుగు నివారణ మందులు అధిక మోతాదులో వాడుతున్నారు. ఎక్కడ టమాట పంట సాగు అవుతుందో.. ఆ ప్రాంతం చుట్టు పక్కల మల్బరీ పంట సాగు చేసిన రైతులకు ఎదురుదెబ్బ తగలుతోంది. పురుగు నివారణ మందులు పిచికారి చేయడం వల్ల.. అవి వాతావరణంలో కలిసిపోయి షెడ్లలోకి వెళ్లి పట్టు పురుగులు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో మల్బరీ పంటకు టమాటతో ఎదురు దెబ్బతగులుతోంది. అలాగే ఇటీవల ఆకుముడత తెగుళ్లు, నచ్చురోగం కారణంగా కూడా గూళ్లు రాలేదని రైతులు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 30 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తుండగా.. ఇప్పుడు 8 వేల ఎకరాలకు పడిపోయింది.

బైవోల్టిన్ రకం కోరుతున్న రీలర్లు

మదనపల్లె ప్రాంతంలో మల్బరీ రైతులు ఎక్కువగా క్రాస్ బ్రీడ్ (సీబీ రకం) పట్టుగూళ్లను పెంచుతున్నారు. డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో ఒక్క రామసముద్రం మండలం మినహా మిగిలిన 14 మండలాల్లో సీబీ రకం గూళ్లు ఉత్పత్తి చేస్తున్నారు. రీలర్లు మాత్రం బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు అయితే పట్టుదారం తెగిపోకుండా ఎక్కువ మొత్తంలో వస్తుందని అంటున్నారు.

మార్కెట్ పరిస్థితి అగమ్యగోచరం

మదనపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఉన్న ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ ఒకప్పుడు రాష్ట్రంలోనే పేరు మోసింది. ఇక్కడికి నాలుగు జిల్లాల నుంచి రైతులు పట్టుగూళ్లను విక్రయానికి తీసుకువచ్చే వారు. మారిన పరిస్థితులతో మార్కెట్కు తక్కువగా విక్రయానికి వస్తున్నాయి. ఈ మార్కెట్పై ఆధారపడి మల్టీ ఎండ్ రీలింగ్ మిషన్లు పెట్టుకున్న రీలర్లు, వారి అనుసంధానంగా పని చేస్తున్న కార్మికులు అయోమయంలో పడిపోతున్నారు. ఇలాగే కొనసాగితే మార్కెట్ మూతపడే పరిస్థితి ఎదురవుతుందని పలువురు అంటున్నారు.

> **రైతులకు అవగాహన కల్పిస్తాం**
>
> 
>
> పట్టుగూళ్ల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ పథకాల గురించి వివరించి పంట సాగు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తాం. టమాట పంటలకు దూరంగా మల్బరీ సాగు చేయాలని సూచనలు ఇస్తున్నాం. నచ్చురోగం వల్ల గూళ్లు దెబ్బతింటున్నాయి. ఈ నెల నుంచి గూళ్లు బాగా వస్తాయని అనుకుంటున్నాం.
>
> – పి.రామమోహన్, సెరికల్చర్ ఏడీ, మదనపల్లె.

చేపల అక్రమ వేటకు పాల్పడితే చర్యలు

కడప అగ్రికల్చర్ : చేపల అక్రమ వేటకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఉప సంచాలకులు కె.శాంతి తెలిపారు. జిల్లాలోని బ్రహ్మంసాగర్ రిజర్వాయర్, దాని వెనుక జలాల్లో అక్రమంగా చేపల వేట చేపడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆమె శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మంసాగర్ రిజర్వాయర్లో అక్రమంగా చేపలు వేటాడుతున్న వ్యక్తులకు రూ.20 వేల జరిమానాను విధించినట్లు తెలిపారు. సంబంధిత డబ్బులను ప్రభుత్వ పద్దుకు జమ చేసినట్లు పేర్కొన్నారు. గండికోట, సోమశిల వెనుక జలాలు, బ్రహ్మంసాగర్లో చేపలను వేటాడేందుకు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. లైసెన్సు దారులు సంబంధిత మత్స్య అభివృద్ధి అధికారి వద్ద పునరుద్ధరించుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో అక్రమంగా చేపలు వేటాడిన వారి లైసెన్సులను ఏపీ ఇన్ల్యాండ్ ఫిషరీస్ యాక్టు–1995 ప్రకారం రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ ఉప సంచాలకులు శాంతి

అనర్హులకూ ఆరోగ్యశ్రీ నిధులు?

- రిమ్స్లో అవకతవకలపై విమర్శలు
- ప్రోత్సాహక డబ్బుల్లో గోల్మాల్

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో పని చేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలు, ఓటీ అసిస్టెంట్ల ఖాతాల్లోకి రెండేళ్ల కాల వ్యవధికి సంబంధించిన ప్రోత్సాహక మొత్తంను ఇటీవలే వేశారు. అయితే కొందరు అనర్హుల ఖాతాల్లోకి కూడా డబ్బులను వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ విభాగం ద్వారా రిమ్స్లో అన్ని విభాగాలకు కేసులు వస్తుంటాయి. ఆరోగ్యశ్రీ కేసులకు సంబంధించిన పేషెంట్లను చూసే బాధ్యత ప్రధానంగా డాక్టర్లు, నర్సులు, ఎఫ్ఎన్ఓలు, ఓటీ అసిస్టెంట్లకు చెందుతుంది. ఆరోగ్యశ్రీ విభాగంలో రోగుల అడ్మిషన్ల దగ్గరి నుంచి డిశ్చార్జి అయ్యేంత వరకు సేవలు చేసే ప్రతి ఒక్కరికీ ఈ డబ్బులను వారి వారి ఖాతాల్లోకి వేయాల్సి వుంది. వైద్య సిబ్బందికే కాకుండా పరిపాలన విభాగానికి సంబంధించిన ముగ్గురు ఆఫీస్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్ల ఖాతాల్లోకి డబ్బులను వేలాది రూపాయలుగా వేయడం ఆరోపణలకు తావిస్తోంది. గతంలో కొన్ని సంవత్సరాలుగా పరిపాలన విభాగం వారి ఖాతాలలో డబ్బులను వేసే వారు కాదు. కానీ తమకు కూడా ఈ డబ్బుల నిబంధనలు వర్తిస్తాయని వారు కోరడం, మిగతా వారి కంటే ఎక్కువ మొత్తంలో ఖాతాల్లోకి జమకావడం విమర్శలకు తావిస్తోంది. ఆరోగ్యశ్రీ విభాగంకు సంబంధం లేని వారి ఖాతాల్లో కూడా కొందరికి ఈ డబ్బులు పడ్డాయనే విమర్శలపై ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవిని వివరణ కోరగా.. నిబంధనల మేరకు మాత్రమే డబ్బులను ఖాతాల్లోకి వేస్తారని తెలియజేశారు.

పాలకవర్గానికి తెలియకుండా నిధులు వాడటం తగదు

- నగరపాలక సంస్థ నిధులతో ఎమ్మెల్యే సొంత ప్రచారం
- ఈ పని చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్సీపీ నేతలు, కార్పొరేటర్ల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నాయకులు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ మేయర్, కార్పొరేటర్లకు మాట మాత్రమైనా చెప్పకుండా నిధులు ఉపయోగించడం దారుణమని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎస్. యానాదయ్య, కార్పొరేటర్లు పాకా సురేష్, రామలక్ష్మణ్రెడ్డి, మల్లికార్జున, బాలస్వామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విజయవాడలో వరదల వల్ల లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని, పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయన్నారు. ఈ నేపథ్యంలో వరద బాధితుల సహాయార్థం కడప నగరపాలక సంస్థ నిధులతో వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు ఒక లారీకి తరలించారని, దీన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే మేయర్, కార్పొరేటర్లకు మాట మాత్రమైనా చెప్పకుండా, ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఆమె భర్త టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాసులరెడ్డి ఫొటోలు వేసిన బ్యానర్లతో వాటిని తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సొమ్ము ఒకరిది... సోకు ఒకరిది అన్నట్లు ఈ వ్యవహారం ఉందన్నారు. నగరపాలక సంస్థలో ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో సభ్యురాలు మాత్రమేనని, ఆమెకు కార్పొరేషన్పై ప్రత్యేక అధికారాలేమీ ఉండవన్నారు. కార్పొరేటర్ల భర్తలను కార్పొరేషన్లోకి అనుమతించాలంటే వారికి ఎలాంటి ప్రొటోకాల్ ఉండదని చెప్పిన ఎమ్మెల్యే మాధవీరెడ్డి.. ఇప్పుడు ఆమె భర్త ఫొటో ఎలా వేయించారని, ఆయనకు కార్పొరేషన్లో ఏం ప్రొటోకాల్ ఉందని ప్రశ్నించారు. వారి సొంత నిధులతో వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు పంపించి ఉంటే, అప్పుడు వారి ఫొటోలు వేయించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలిశాక టీడీపీ నేతలు 40 శాతం నిధులు ఇస్తామన్నారని అధికారులు బుకాయిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ చర్యకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, వైఎస్సార్సీపీ డివిజన్ ఇన్చార్జిలు మల్లికార్జున కిరణ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ





మ్యాచ్ ఆడుతున్న కడప, కర్నూలు జట్లు (ఇన్సెట్) మాధవ్, నెల్లూరు (88 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్లో 40 పరుగుల ఓవర్నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు శుక్రవారం 62.4 ఓవర్లలో 383 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఎన్. మాధవ్ 88, రోషన్ 52, సుతేజ్రెడ్డి 52 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు మల్లికార్జున 4, భార్గవ్ 2, సాయిలోహిత్ 2, దీపక్ 2 వికెట్లు తీశారు. అనంతరం 288 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. జట్టులోని యోగానంద 67, మహేంద్రారెడ్డి 21 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు సుబ్రమణ్యం 2 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి విజయానికి 142 పరుగుల దూరంలో నిలిచింది. కాగా తొలి ఇన్నింగ్స్లో అనంత జట్టు 235 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా, నెల్లూరు జట్టు 133 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఆధిక్యంలో కడప జట్టు

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్లో 72 పరుగుల ఓవర్నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు రెండో రోజు 64.4 ఓవర్లలో 234 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మహేంద్ర యాదవ్ 67, సాయికృష్ణ సింగ్ 47 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఆదిల్ హుస్సేన్ 4, అయూబ్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. జట్టులోని శివకేశవరాయల్ 38, జాఫర్అలీఖాన్ 36 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు కనిష్ 1, అక్షిత్ 1 వికెట్ తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్లో కడప జట్టు 223 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 154 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

అయ్యో పాపం

కల్వర్టును స్కూటర్ ఢీకొని బాలిక మృతి



మృతి చెందిన సుమ దివ్య

జమ్మలమడుగు రూరల్ : తండ్రితో కలిసి ఆ బాలిక సంతోషంగా ఇంటికి వెళ్తుండేది. కానీ, విధి చిన్నచూపు చూసింది. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలి తీసుకుంది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. శుక్రవారం చిటిమిటిచింతల గ్రామ పొలిమేరలో కల్వర్టును స్కూటర్ ఢీకొన్న సంఘటనలో సుమ దివ్య (10) అనే బాలిక దుర్మరణం చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరుకు చెందిన సుంకన్న కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం సుంకన్న, భార్య, ఇద్దరు కూతుర్లు సుప్రియ, సుమదివ్య, కుమారుడితో కలసి మైలవరంలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి శుక్రవారం రాత్రి స్వగ్రామమైన ముద్దనూరుకు స్కూటర్లో సుంకన్న తన ఇద్దరు కూతుర్లతో కలిసి వెళ్తుండగా మార్గంమధ్యలోని చిటిమిటి చింతల గ్రామ పొలిమేరలో కల్వర్టును ఢీకొన్నారు. స్కూటరు సుమారు 10 అడుగుల లోతులో కింద పడింది. ఈ సంఘటనలో రెండో కూతురు సుమ దివ్య అక్కడికక్కడే మృతి చెందగా, సుంకన్నకు స్వల్ప, పెద్ద కూతురు సుప్రియకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను స్థానికులు ప్రైవేట్ వాహనంలో కర్నూలుకు తరలించారు. భార్య, కుమారుడు బస్సులో వెళ్లడంతో ప్రమాదం తప్పింది.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహమ్మద్ఖాన్

మదనపల్లె : కుటుంబ కలహాలతో భార్య కాపురానికి రాలేదన్న కారణంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. బసినికొండ పంచాయతీ పుంగనూరు రోడ్డు ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద నివాసమున్న హైదర్వల్లి కుమారుడు మహమ్మద్ఖాన్ (23) భవన నిర్మాణ కార్మిక మేస్త్రీగా పని చేస్తున్నాడు. వివాహం అయిన తరువాత భార్య షబ్రీన్తాజ్తో కలిసి వేరు కాపురం పెట్టాడు. ఇటీవల ఆమె గర్భం దాల్చి పుట్టింటికి వెళ్లింది. అయితే మహమ్మద్ఖాన్ తల్లి అనారోగ్యానికి గురికావడంతో వెళ్లి పరామర్శించి వచ్చాడు. ఈ విషయమై మహమ్మద్ఖాన్తో భార్య గొడవ పడింది. తరువాత ఫోన్ చేసి ఇంటికి రావాల్సిందిగా భర్త కోరినా తిరస్కరించింది. దీంతో మనస్తాపం చెందిన మహమ్మద్ఖాన్ శుక్రవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కూడా పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సంజీవరెడ్డిపల్లెలో చోరీ

దువ్వూరు : మండలంలోని సంజీవరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున మార్రెళ్ల రామసుబ్బారెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామసుబ్బారెడ్డి ఇంటి వెనుకవైపు ఉన్న డోర్ను పగలగొట్టి దొంగలు ఇంటిలోకి వెళ్లారు. లోపల బీరువా, కప్బోర్డులను పగలగొట్టి మూడు తులాల బంగారు నగలు, ఐదు తులాల వెండి నగలు, రూ.6 వేల నగదు అపహరించారు. వీటి మొత్తం విలువ రూ.లక్షా 68 వేలు ఉంటుంది. రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, కడప నుంచి క్లూస్ టీంను పిలిపించి పరిశీలించినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. గ్రామంలో మరో రెండు ఇళ్లలో చోరీకి ప్రయత్నించినట్లు ఆయన పేర్కొన్నారు.



బాధితుడి ఇంటిని పరిశీలిస్తున్న సీఐ శివశంకర్

రిమ్స్కు సమస్యల రోగం

- ఐపీ విభాగం సమీపంలో కుక్కల బెడద
- దెబ్బతిన్న స్ట్రెక్చర్లు, వీల్చైర్లు
- ఫార్మసీ కౌంటర్లో విధుల్లో అలసత్వం
- ఓపీ విభాగంలో నీళ్లు కరువు



క్యాజువాలిటీ వద్ద వంగిపోయిన చక్రాలతో కుంగిన స్ట్రెచర్



ఐపీ విభాగం బయట రాత్రి వేళలో కుక్కల స్వైర విహారం



సెంట్రల్ ల్యాబ్లో కుళాయిలకు నీళ్లు రాక బకెట్తో తెచ్చుకున్న సిబ్బంది



ఐపీ ఫార్మసీలో సిబ్బంది లేక ఖాళీగా వున్న కౌంటర్, కుర్చీ

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)ని సమస్యల రోగం పట్టిపీడిస్తోంది. కొన్ని పరికరాల నాణ్యతా లోపం, కొందరు సిబ్బంది పనితీరుతో రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- కడప నగరంతోపాటు రాయచోటి, ఇతర పట్టణాల్లోని వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా వుంది. వీటి వల్ల అనేక మంది కుక్క కాటుకు గురై వైద్య సేవల కోసం ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న సంఘటనలు నిత్యం చూస్తున్నాం. అయితే కడప రిమ్స్లోనూ ఐపీ, ఓపీ విభాగాల బయటనే పగలు, రాత్రి తేడా లేకుండానే కుక్కలు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా కాన్పుల విభాగంతో పాటు ఇతర వార్డుల్లోకి కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఇక్కడి సిబ్బంది కృషి చేయకపోతే కష్టాలను చవిచూడాల్సి వుంటుంది.
- ఐపీ విభాగంలో నిరంతరం ఫార్మసీ విభాగం కౌంటర్ పేరుకు మాత్రమే వుంది. అక్కడ రాత్రి వేళల్లో విధులను నిర్వహిస్తున్న వారిలో కొందరు మాత్రం పేరుకే ఉద్యోగం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు రోగులు మందుల కోసం వస్తే.. ఎవరూ కనీసం సమాధానం చెప్పేవాళ్లు కూడా వుండరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది తమకు ఫోన్ వస్తే చాలు.. టవర్ అందడం లేదనే నెపంతో బయటకు వెళ్లి ఫోన్లలో మాట్లాడుతూ గంటల తరబడి రాకపోవడం జరుగుతోంది. దీనివల్ల మందుల కోసం వచ్చిన వారు ఎదురుచూడాల్సి వస్తోంది.
- ఓపీ విభాగాలలో తాగడానికి గానీ, టాయిలెట్స్లలో గానీ నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది తెలియజేస్తున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో భోజనం చేసిన తరువాత చేతులు కడుగుకోవాలన్నా, వాష్ రూమ్లకు వెళ్లాలన్నా బకెట్లతో పట్టుకుని వస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- క్యాజువాలిటీతోపాటు ఇతర ఐపీ, ఓపీ విభాగాలలో రోగులను తీసుకెళ్లేందుకు వినియోగిస్తున్న స్ట్రెక్చర్లు, వీల్చైర్లలో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇటీవల సదరు స్ట్రెక్చర్లపైకి రోగులకు తీసుకుని వచ్చే ప్రయత్నం సిబ్బంది చేస్తే.. ఆ స్ట్రెక్చర్ అలాగే కుంగిపోయి రోగి కిందకు పడిపోయే పరిస్థితికి వచ్చింది. వీల్ చైర్లకు కాళ్ల వద్ద తాళ్లను కట్టి మరీ వారిని తీసుకెళుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే సెలైన్ బాటిళ్లను ఎక్కించే ఐవీ స్టాండ్లు కొరత ఎక్కువగానే వుంది.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో తలెత్తుతున్న సమస్యలపై డాక్టర్ రమాదేవిని వివరణ కోరగా.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కుక్కల బెడదను తగ్గించడానికి మున్సిపల్ కార్పొరేషన్ వారికి లెటర్ రాశామని పేర్కొన్నారు. వీల్చైర్లు, స్ట్రెక్చర్లు ఇంకా కావాలని డీఎంఈకి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. సిబ్బంది పనితీరు, నీటి సౌకర్యం లాంటి విషయాలపై పర్యవేక్షణ చేస్తామన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని వివరించారు.